# ఓ గృహిణి కథ

## ఎలక్ట్రిన్

శ్రీవార్లు యింటి ఖర్చులకని యిచ్చే డబ్బుని పొదుపుగావాడి యెంతో కొంత ఆదా చెయ్యడం, గృహిణుల ధర్మమని నమ్మిన వాళ్ళల్లో నేనూ ఒకర్తినవడం మూలాన, ఉద్యోగరీత్యా పై రాష్ట్రంలో కాపురం పెట్టిన మర్నాటినుంచీ, యింటి అజమాయిషీ అంతా నెత్తిన వేసుకున్నాను.

ఆయన వెర్రిబాగుల మనిషిలా కనిపించినా, మనిషిమట్టుకు మహా మొండిఘటం. అందులోనూ తెలివైన మొండిఘటం. ఆయనగురించి డబ్బా వాయించుకుంటున్నా ననుకోకండి. ఆయన మంచితనాన్నీ వెధవగుణాల్నీ పొగడ్డానికయినా తెగడ్డానికయినా నాకేహక్కుంది కాని, మరో ఆడదెవర్తయినా కల్గజేసుకుంటే వాళ్ళని నేనే వాయించాల్సొస్తుంది. సరే యింకోరి మొగుడలాంటివాడు. కొండమీద కోతినయినా తీసుకొస్తాడు లాంటి విషయాలు నేను మాట్లాడితే ఆయన చివాట్లేస్తారు. అందుచేత నేనేం చేసినా, మాట్లాడినా మా ఆయన్ని గురించే.

సరే డబ్బు ఆదా చేద్దామని యెంతో ప్రయత్నం చేశాను. ఆయనకెంత జీతం వస్తుందో తెలుసు. కంపెనీ ఆయనజీతం బేంకులో డిపాజిట్ చేస్తుంది జాయింట్ ఎక్కవుంట్ ఓపెన్ చేశారు. అంతే ఆరోజునుంచీ యిన్నేళ్ళల్లోనూ ఆయన ఒకసారో, రెండుసార్లో బేంకుకి వెళ్ళుంటారు. నాకీ స్వతంత్రమిచ్చి, నాచేతులు కట్టిపారేశారని చాలాకాలందాకా గ్రహించలేకపోయాను. వెర్రిబాగుల దాన్ని గట్టిగా ఓ చీరకానీ, మరేవైనా చిన్న చిన్న వస్తువులుకానీ (నిత్యావసరాలకి పనికిరానివే అనుకోండి.) కొందామనుకుంటో, "వచ్చే జీతం, ఉన్న ఖర్చులూ నీకు తెలుసు. నీ కెలా భావ్యమని తోస్తే అలా చెయ్యి" అంటూ నా నోరు కట్టేస్తారాయన. ఏం చెయ్యడం?

ఇంత స్వేచ్ఛ ఉన్నా, నా మీదా యింటి ఖర్చులమీద నిఘా ఉంచుతున్నారేమోనన్న యిది, అప్పుడప్పుడు నన్ను యిబ్బంది పెట్టేది.

ఆయన మంచి మూడ్‌లో ఉన్నప్పుడు, చిన్ననాటి సంగతులు అప్పుడప్పుడు చెప్పేవారు. అటువంటి విషయాలలో ఒకటి నాకు దారి చూపించింది.

వాళ్ళ ఊరులో ప్రతిఆదివారంకూరల సంత జరుగుతుంది. వారానికి సరిపడ్డ కూరలన్నీ, సంతలోనే కొనడం వాళ్ళ కలవాటు. ఆయన స్కూల్ ఫైనల్ చదివే రోజుల్లో సంతకెళ్ళే అర్హత సంపాదించారు. వాళ్ళబామ్మగారిది పెత్తనమంతాను. పాకెట్ మనీకి ఆదివారం సంత. యింట్లో పిల్లలకి పెద్ద అవకాశ

మన్నమాట. సరే యీయన కూరలు కొని, ఎక్కువ ధరలు చెప్పి మొత్తం మీద రూపాయో, అర్ధో నొక్కేసేవారుట. అయితే వాళ్ళ బామ్మ చాలా తెలివైన ఘటం. అందుచేత ధరవరలమీద నిఘా ఉంచుతూ, వాళ్ళ అబద్ధాలని బయట పెట్టేసి, కమీషన్లకి బ్రేకు వేసేదట. వాళ్ళ పిన్నితమ్ముడు వాళ్ళతోనే చదివే వాడుట. వాళ్ళిద్దరూ కలిసి ఆలోచించి, ఒక చిట్కా కనిపెట్టారు. ధర లలానే ఉంచి ప్రతి కూరలోను బరువు తగ్గించె య్యడం. అంటే మూడు వీశల బంగాళా దుంపల బదులు, రెండు వీశల మూడు ఏబులాలుకొని, ఆ మిగిలిన ఏబులం తాలూకు డబ్బులు నొక్కేయడం అన్న మాట (ఇవి పాత బరువులు. అవేమిటో మీకు తెలీకపోతే, మీ యింట్లో పెద్ద వాళ్ళని అడగండి.) బరువుల్లో వచ్చే తేడాలు కనుక్కోవడం కష్టంకదా! ఈ పథకం అమల్లో పెట్టిన తర్వాత 'పాతాళ భైరవి' సినిమా ఎనిమిది సార్లు చూడ గలిగేరట. ఆ కాలంలో బెంచీ పావలా అర్ధణాట. అనాలోచితంగా దారిచూపించి నందుకు వెయ్యిదేముళ్ళకిదణ్ణంపెట్టాను.

మూడు లీటర్ల పాలు రెండుముప్పావు లీటర్లు చేశాను పాలవాడెలాగూ నీళ్ళుకలి పేస్తున్నాడు. మరో పావులీటరు నీళ్ళు యే లెఖ్ఖలోకి? అప్పుడప్పుడు, ఆయనా పిల్లలూ మరో గరిటెడు పెరుగెక్కువ లాగించినప్పుడు ఆపావులీటరు నీళ్ళు కలిపి, మజ్జిగతో నేను సరిపెట్టుకొనే దాన్ని. ఇలా వీలైనప్పుడు, యితర సరు కులమీదా నా యీ పథకాన్ని అమలు జరిపి ఓ మూడు నెలల్లో సునాయాసంగా నూటయాభై రూపాయలు ఆదాచేశాను. ఇది దొంగతనం అనుకుంటే మీరు పొర బడ్డట్టే. ఆయన కష్టసుఖాల్లో పాలు పంచు కుంటున్నప్పుడు, నాకామాత్రం యిది ఉండాలి. నేనుమొండిపట్టుపట్టికూర్చుంటే ఆయనకీ చీరలూ, యితర వస్తువులూ ఎలాగూ కొనక తప్పదు. కాని యిది ఇద్ద రికీ యిబ్బందిలేని పద్ధతికదా! ఆయన నాకు కొనవలసిన చీరకి నేనిలా డబ్బు ఆదాచేసి నేనే ఆ చీరను కొనుక్కుంటే దోషం లేదుకదా!

ఓరోజున నేనూ, మా ఆయనా బజా ర్లోంచి వస్తూంటే, జోధ్‌పూర్ బందినీ శిల్కుచీర ఓ బట్టలషాపువిండోలోచూసి నప్పటినుంచి నా మనస్సు ఆ చీరమీదే ఉండిపోయింది. ఆ చీర ఎన్నోసార్లు కలల్లోకికూడా వచ్చి నన్ను ఇబ్బంది పెట్టింది.

సరే డబ్బు పోగుపడిన తర్వాత, మనసు కంగారు పెటడంమొదలుపెట్టింది. ఓశనివారం రోజు నేనూ, పక్కింటావిడ యిద్దరం బజారుకి వెళ్లాలని నిశ్చయించు కున్నాం. ఆఫీసుకు వెళ్ళిన ఆయనగారు ఆ వేళ పన్నెండింటికే యింటికి వచ్చి కూర్చున్నారు. ఆఫీసుల్లో పనిచేసే వాళ్ళె వరో గొడవలు లేవదియ్యడం మూలాన శాంతి భద్రతలకోసం ఆపూట ఆఫీసు మూసేశారట. నాకు ఒళ్ళు మండింది. ఆ గొడవలు లేవదీసినవాళ్ళని కసితీరా తిట్టుకున్నాను కానీ కార్యసాధనకు ఉపా యాం ఆలోచించాను.

"ఇవాళ మనింటికి చుట్టుపక్కల ఆడవాళ్ళు వస్తున్నారు. మీ ఆఫీసు ఇలా మూసేస్తారని నేను కలగనలేదు. తీరా

వాళ్ళొస్తె, మీకూ వాళ్ళకీ కూడా ఇబ్బందిగా ఉండొచ్చు. అందుకని, మీరేదన్నా యింగ్లీషు సినిమాకి హాయిగా వెళ్ళిరండి" అన్నాను.

ఆయన వింతగా నాకేసిచూస్తూ ఉండిపోయారు. కారణం లేకపోలేదు. స్నేహితులతో, ఆఫీసు వదిలిన తర్వాత ఆయన సినిమాలకి తిన్నగా చెక్కేసినప్పుడు, యింట్లో ఎవరో కాలం చేసేసినట్లుగా నేను యేడ్చినరోజులు చాలా ఉన్నాయి. చివరకి ఆయనకే విసిగెత్తి వంటరిగా సినిమా చూడ్డం మానుకున్నారు. తర్వాతర్వాత యిరుగుపొరుగు ఆడవాళ్ళతో నేను చూసిన సినిమాలసంగతి చెప్పినా హాయిగా నవ్వేసి ఊరుకునేవారు. సరే ఏది యెలా ఉన్నా ఆయన "ఏమిటీ, నువ్వేనా యీ మాటలంటున్నదీ!?" అన్నారు. ఓ నవ్వు నవ్వేసి లోపలికి వెళ్ళిపోయాను. ఆయన హుషారుగా మేట్నీకి వెళ్ళిన తర్వాత, అనుకున్నట్లుగా ఆ షాప్‌కి వెళ్ళాం. నూట డెబ్భై రూపాయలు చెప్పిన ఆ చీరని బేరమాడి నూట యాభైకి కొనుక్కుని వచ్చేశాం. ఆ మర్నాడు నా పుట్టినరోజు. ఆ చీరకట్టుగుని ఆయన్ని ఆశ్చర్యపరచాలని, నా పుట్టినరోజు సంగతి మర్చిపోయిన ఆయన్ని ఎగతాళి చెయ్యాలని నా ఐడియా అన్నమాట.

సాయంత్రం ఏడింటికి ఆయన ఉత్సాహంగా యింటికొచ్చారు. వస్తూనే మూడు ఏళ్ళ తర్వాత నన్నొక్కర్తెన్నే సినిమాకెళ్ళనిచ్చినందుకు నీకు బహుమతి" అంటూ ఒక పేకెట్ చేతిలో పెట్టారు.

"హుషారుగా ఉందే వ్యవహారం! సినిమాలో ఎవరయినా పక్కకి జేరారా? (అసలిందుకే ఆయన వంటరిగా సినిమాలకు వెళ్తారని మొదట్లో నాకు దురభిప్రాయం ఉండటం మూలాన, అప్పుడప్పుడూ స్నేహితుల బలవంతమీద సినిమాలకనీ, మరో ప్రోగ్రాములకనీ వెళ్ళవలసొస్తుందని తర్వాత గ్రహించాను). అయినా యిందుకోసమని కాకుండా, రేపు నా పుట్టిన రోజుకనియిస్తే యింకా సంతోషించే దాన్ని" అన్నాను కొంచెం వ్యంగ్యంగా లోపల సంతోషిస్తూనే?

"సరేలే యిది పుట్టినరోజు బహుమతే అనుకో. గొడవెందుకు?" అన్నారాయన విలాసంగా. నేనుసంతోషంగాపేకెట్‌విప్పి చూశాను. ఒక్క క్షణంలో సంతోషం ఎగిరిపోయింది. "ఆ రోజు షాపులో చీర చూసి బాగుందన్నావుకదా! అందుకని కళ్ళు మూసుకునిదీన్ని కొనుక్కొచ్చేశాను. నూటనలభయి రూపాయలు" ఆపైన ఆయనన్నమాటలు నాకు వినిపించలేదు.

నాకెందు కెడుపొచ్చిందో-మీరుఊహించుకోకలిగిన రెండు కారణాలూ, తెలియని మరో కారణాన్నీ చెప్తున్నాను-ఒకటి - ఒకేరకం చీరలు రెండు ఉంచుకోవడానికి కట్టుకోవడానికీ ఏ ఆడదీ యిష్టపడదు. రెండోది నూటడెబ్భైరూపాయలు చెప్పిన చీరని బేరమాడి నేను నూట యాభైకితీసుకొస్తే, ఆయనఅదేరకంచీరని వాడు చెప్పిన నూట నలభై రూపాయలకి మారు బేరం లేకుండా తీసుకొచ్చారు. (ఆ షాపులో మరి జన్మలో నేను బట్టలుకొనదల్చుకోలేదు.)

ఇహపోతే మూడోది. ఆయనఆఫీసు గొడవల మూలాన, ఆఫీసు మూసేశారనే చెప్పారు కాని, ఆఫీసులోగొడవలు, ఆ రోజు ఉదయం పూట యిచ్చినబోనస్ విషయం మూలాన అని చెప్పలేదు. తెలిసుంటే ఆయన జేబులో సినిమా ఖర్చులొక్కటే ఉంచి మరీ పంపేదాన్ని.